క్లుప్తంగా

ఆయిల్ బాల్స్‌తో లార్వా నిర్మూలన



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాల్లో మురుగునీరు నిలిచిన ప్రాంతాల్లో సోమవారం పంచాయతీ సిబ్బందిచే ఎంఎల్ ఆయిల్ బాల్స్ వేయించినట్లు ఎంపీహెచ్ఏ బాబురావు అన్నారు. పంచాయతీ సిబ్బందిచే బీసీ కాలనీ, అమీనాబాద్ ప్రాంతంలోని వర్షం నీరు నిలిచిన పలు ప్రాంతాలల్లో ఎంఎల్ ఆయిల్ బాల్స్ వేస్తున్న తీరును పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఎంఎల్‌హెచ్ఏ బాబురావులు పరిశీలించారు. ఎంఎల్ ఆయిల్‌లో ఊకతో చేసిన బంతులను 5 రోజుల పాటు నానబెట్టి వాటిని నీటి కుంటల్లో వేస్తున్నట్లు చెప్పారు. దీంతో దోమల లార్వా పూర్తిగా నిర్మూలించబడి, దోమల వృద్ధి తగ్గుతుందన్నారు. పదిరోజుల పాటు ఎంఎల్ ఆయిల్ ప్రభావం ఉంటుందని చెప్పారు.

ఎల్‌వోసీ చెక్కులు అందజేత

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన ఎల్‌వోసీ చెక్కులను సోమవారం తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి 6వ వార్డుకు చెందిన ఉప్పు లక్ష్మికి రూ.75,000, 15వ వార్డుకు చెందిన కుండ నాగసాయి కుసుమకు రూ.29,544, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశామని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ వివిధ అనారోగ్యాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి భరోసాగా నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అద్దంకి మురళి, భాస్కరరావు, మస్తాన్ వలి, ప్రసాద్, దుర్గారావు, తాడిబోయిన గోపి పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

మంగళగిరి: రైతుల సంక్షేమానికి వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు కృషి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పీఏసీఎస్ అధ్యక్షుడు తెలిపారు. సోమవారం మంగళగిరి, నూతక్కి నూతన వ్యవసాయ సహకార సంఘాల ప్రమాణస్వీకారం మంగళగిరి మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించారు. మంగళగిరి సహకార సంఘం అధ్యక్షుడిగా గాదె పిచ్చిరెడ్డి, సభ్యులుగా వాసా వేణుకుమార్, అందె శివశంకరరావు, నూతక్కి సహకార సంఘం అధ్యక్షుడిగా వల్లూరి వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. నూతన పాలక వర్గాలను అభినందించిన మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ జువ్వాది కిరణ్ చందుతో పాటు పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి రైతుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మంగళగిరి వైస్ చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతయ్య పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న సేవలు స్ఫూర్తిదాయకం



మంగళగిరి టౌన్: బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి గోల్కొండ కోటను జయించి రాజ్యాధికారాన్ని అందించిన దేశపు తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు వాకా రామగోపాల్ గౌడ్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని పాత మంగళగిరి గౌడ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సర్వాయి పాపన్న సేవలు తెలుగు రాష్ట్రాల యువతకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బహుజన రాజ్యాధికారం కోసం పాపన్న గౌడ్ ఉద్యమించిన తీరు స్ఫూర్తిదాయకమని, ఆయన బాటలో బహుజనులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర గౌడ సంఘం మహిళా అధ్యక్షురాలు కల్యాణి, రాష్ట్ర తెలుగునాడు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు రేఖా సుధాకర్ గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య తూటాకు.. దుర్వాసనతో ఇబ్బందులు



పీడబ్ల్యూడీ వర్క్‌షాపులో డంప్ చేసిన తూటాకు, గుర్రపు డెక్క

తాడేపల్లి రూరల్ పరిధిలోని కృష్ణానది ఎగువ ప్రాంతంలోని అమరావతి కరకట్ట వెంబడి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్ద ఇరిగేషన్ అధికారులు సోమవారం ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ వద్ద ఉన్న తూటాకును తొలగించారు. వేల టన్నుల తూటాకు, గుర్రపు డెక్క రావడంతో దానిని లారీల్లో లోడ్ చేసి పీడబ్ల్యూడీ వర్క్‌షాపులో గోడ పక్కన డంప్ చేస్తున్నారు. చుట్టుపక్కల నివాసాలు ఉండడంతో తూటాకు, గుర్రపుడెక్క నుంచి వచ్చిన నీరు రోడ్ల పైకి వస్తోందని, అలాగే తూటాకు నుంచి వస్తున్న దుర్వాసన వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు తూటాకును వెంటనే డంపింగ్ యార్డుకు తరలించాలని కోరుతున్నారు.

– తాడేపల్లిరూరల్

రోడ్డుపైనే వర్షపు నీరు



బోరుపాలెంలో డ్రైనేజీ లేక రోడ్లపైనే పారుతున్న వర్షపు నీరు

తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా వర్షం పడితే రోడ్లపైనే నీరు నిలబడి అధ్వాన్నంగా మారుతుంది. చిన్నపాటి వర్షానికే రోడ్డు నీటితో నిండుతుండటంతో పాదచారులు, సమీప నివాసాల ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని పలువురు కోరుతున్నారు.

– తాడికొండ

దుగ్గిరాల ఎస్టీవోపై చర్యలు తీసుకోవాలి

జిల్లా ఖజానాధికారికి ఫిర్యాదు చేసిన యూటీఎఫ్ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల బిల్లులను పెండింగ్‌లో ఉంచి వేధింపులకు గురి చేస్తున్న దుగ్గిరాల ఉప ఖజానాధికారి(ఎస్టీవో)పై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానాధికారి కార్యాలయంలో డీటీవో చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి యూటీఎఫ్ ప్రతినిధులు ఎస్టీవోపై ఫిర్యాదు చేశారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఎస్టీవో అశ్విని ప్రతి నెలా వేతన బిల్లులను మంజూరు చేయకుండా కొర్రీలు వేసి తిప్పి పంపుతున్నారని ఆరోపించారు. అవసరం లేని జీవోలను డిమాండ్ చేస్తున్నారని, దీని అర్థం ఏమిటో చెప్పాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు 2 నెలలుగా వేతనాలు లేవని, దుగ్గిరాల ఎస్టీవో పరిధిలోని దుగ్గిరాల, కొల్లిపర మండల ఉపాధ్యాయుల బిల్లులను పాస్ చేయకుండా నిలిపివేయడం వేధింపులుగా పరిగణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తాను మంత్రి తాలూకా అని, నన్నేమీ చేయలేరని బెదిరింపులకు దిగుతున్నారని డీటీవో దృష్టికి తెచ్చారు. పదేళ్ల క్రితం హెచ్ఆర్ఏ మారి వేతనాలు పొందుతున్న వారిని జీవోలు తేవాలని వేధిస్తున్నారని, తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, జి.వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, బి.ప్రసాదు, ఎం.కోటిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రెహమాన్, చంద్రశేఖర్, శివపూర్ణయ్య, ధనరాజు, భాస్కర్ ఉన్నారు.



డీటీవో చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధుల బృందం

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ఏవో ఆర్.విజయబాబు

దుగ్గిరాల: మండలంలోని రైతులకు ఇప్పటివరకు ప్రభుత్వ సొసైటీలు, ప్రైవేటు దుకాణాల ద్వారా 782 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేశామని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. సోమవారం దుగ్గిరాల వ్యవసాయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగు 20 వేల ఎకరాలలో సాగవుతున్నదని, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా వరి వేశారని అన్నారు. 19వ తేదీకి సొసైటీలకు 80 మెట్రిక్ టన్నుల యూరియా, 100 మెట్రిక్ టన్నుల డీఏపీ, రైతు సేవా కేంద్రాలకు 46 మెట్రిక్ టన్నుల యూరియా, 15 మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



విద్యా దాతల విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరించి, మాట్లాడుతున్న గాదె కుటుంబ సభ్యులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో నిర్మించిన గాదె రామయ్య, సీతారావమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థలం కేటాయించారు. దానికి గుర్తింపుగా వారి విగ్రహాలను ఏర్పాటు చేసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాదె రామయ్య, సీతారావమ్మల కుమారుడు గాదె సోమశేఖరరావు, కుమార్తె చాముండేశ్వరిదేవి, గాదె భావన్నారాయణ, కుటుంబ సభ్యులు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండవల్లిలో పాఠశాల నిర్మాణం కోసం సుమారు రూ.10 కోట్ల విలువైన భూమిని ఇచ్చిన విద్యాదాతలు రామయ్య దంపతులని పేర్కొన్నారు. గతంలో ఉండవల్లిలో పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు పెనుమాక వెళ్లాల్సి వచ్చేదని, విద్య కోసం వారు పడుతున్న ఇబ్బందులను గమనించి, 1978లో భూదానం ఇవ్వడంతో పాటు పాఠశాల భవనాన్ని నిర్మించి ఇచ్చారని తెలిపారు. పాఠశాల భవన నిర్మాణంలో విశిష్ట సేవలందించిన శ్రీరామచంద్రమూర్తి (జై ఆంధ్రా మాష్టారు)ని స్మరించుకుంటూ వారి పిల్లలు భానుమతి, జనార్దన్, విక్రమ్‌ను గాదె కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోజిని, ఆంజనేయులు, భారతీరాజా తదితరులు పాల్గొన్నారు.

'విట్' హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

తాడికొండ: విట్ కళాశాలలో హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, యశ్వంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విట్ వర్సిటీ సీఎస్‌వో ఓం ప్రకాష్‌తో పాటు తుళ్ళూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. వారు మాట్లాడుతూ విట్ వర్సిటీ మెస్‌లో నాణ్యతలేని కలుషితమైన ఆహారం పెడుతుండటం వలన అనారోగ్యం పాలవుతున్నామంటూ విద్యార్థులు ఆందోళన చేయడం దురదృష్టకరమన్నారు. ప్రఖ్యాత వర్సిటీలో విద్యార్థులకు కలుషిత ఆహారాన్ని పెడుతున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యతలేని ఆహారం పెట్టడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విట్ విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రికి యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు లేఖలు రాశారని, ప్రభుత్వం, విట్ యాజమాన్యం స్పందించి తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. రాజధాని గ్రామాల విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తామని యాజమాన్యం ఇచ్చిన హామీకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.

పూలింగ్ పేరుతో రైతులను మోసం చేస్తే సహించం

ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావు



50వ రోజు నిరసన దీక్షలో ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావు

తాడికొండ: పూలింగ్ పేరుతో రాజధాని రైతులను మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తే అడ్డుకుంటామని ఆంధ్ర రాష్ట్ర సమితి అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అదనపు పూలింగ్ పేరుతో చేస్తున్న యత్నాన్ని నిరసిస్తూ మండలంలోని నిడుముక్కల గ్రామంలో కొనసాగుతున్న రిలే నిరసన దీక్షలు సోమవారంతో 50వ రోజుకు చేరాయి.

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ భూములు తీసుకొని విదేశాలకు ఎక్కువ ధరలకు అమ్ముకునేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే డీల్ ఫిక్స్ చేసిందని, తాము నిరసన తెలపడం, రైతులు అడ్డం తిరగడంతో తాత్కాలికంగా వాయిదా వేసిందన్నారు. గతంలో 4 సంవత్సరాలు ఉద్యమం చేసి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు తాను 4 ఏళ్లు ఉద్యమం చేసి వారిని 4 సీట్లకే పరిమితం చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. మొదటి దశ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయకుండా మళ్లీ పూలింగ్ ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రపంచ మేధావి అని చెప్పుకునే సీఎం రైతులకు ఎకరాకు రూ.1 కోటి పరిహారం, 1250 గజాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకునే వరకు తమ నిరసన దీక్షలు విరమించేది లేదని, రైతుల కోసం ముందుకు నడుస్తానన్నారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి



ధర్నాలో రైతు సంఘం నాయకులు, రైతులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో నాయకులు

దుగ్గిరాల: పంట నష్టపోయిన ప్రతి రైతుకు రూ.15 వేలు నష్ట పరిహారం అందించాలని కోరుతూ సోమవారం దుగ్గిరాల తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం అనుబంధ సంఘాలు జిల్లా, మండల వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. తహసీల్దారు ఐ.సునీతకి వినతిపత్రం అందజేసి అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ భూమి యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని,ఎరువులు, యూరియా, డీఏపీ కొరత ఉందని, రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం సక్రమంగా అందించే ఏర్పాటు చేయాలని సూచించారు. పెదకొండూరులో లంక భూమిని సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు మన్నవ నాగమల్లేశ్వరరావు, కార్మిక నాయకులు జెట్టి బాలరాజు, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మి రెడ్డి, ఎస్.యోగేశ్వరరావు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వినతి

ఫిరంగిపురం: అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బ తినడంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కౌలు రైతు సంఘం మండల నాయకులు కోరారు. స్థానిక తహసీల్దార్ జె.ప్రసాదరావుకు సోమవారం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ భూమి యజమాని సంతకంతో పనిలేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రైతు సేవా కేంద్రంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వై.నాగేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, అంకమ్మరావు, సీఐటీయూ నాయకుడు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు అందజేయాలి

మంగళగిరి/మంగళగిరి టౌన్ : కౌలు రైతులకు భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి, పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు అన్నారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు కూడా ఇవ్వాలని, ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళగిరి, పెదకాకాని ప్రాంతాల్లో 70 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీలో 200 రోజులు పని కల్పించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు పేరిరెడ్డి, రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు కోటేశ్వరి, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, సీఐటీయూ నాయకులు దుర్గారావు, జవహర్‌లాల్, రాఘవులు, చెంగయ్య పాల్గొన్నారు.

తక్షణమే ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలి



మంగళగిరి టౌన్/దుగ్గిరాల: చిలువూరు, తుమ్మపూడి గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను (ఇంగ్లీష్ మీడియం) తక్షణమే ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్‌సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళగిరి పరిధిలోని విద్యాభవన్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల క్రితం చిలువూరులో ఉన్న ఎస్‌కేవీఎస్ ఎయిడెడ్ హైస్కూల్ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను స్కూల్ మేనేజ్‌మెంట్ సరెండర్ చేయడంతో ఆ పాఠశాల మూసివేయబడిందన్నారు. దీనివల్ల సుమారు 700 మంది విద్యార్థులు విద్యాహక్కులు కోల్పోయారని పేర్కొన్నారు. దీనిపై హ్యూమన్‌రైట్స్ కమిషన్ 2 సంవత్సరాలు విచారణ జరిపి రెండు గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఇంగ్లీష్‌మీడియం)ను ఏర్పాటు చేయాలని ఆదేశించిందని గుర్తు చేశారు. గతంలో జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించిందని, తెనాలి సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన కూడా జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఆ రెండు గ్రామాల్లో పాఠశాలలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పాఠశాల విద్యా కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అభ్యాస ఫౌండేషన్ చైర్మన్ ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయించుకోవాలి: ఏవో

దుగ్గిరాల: అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం విడుదల చేసిన నగదు జమ కాని రైతు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. సోమవారం దుగ్గిరాల వ్యవసాయ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి విడత రూ.5 వేలు జమ కాని ప్రతి రైతు విధిగా ఎన్‌పీసీఐ నమోదు 25వ తేదీలోపు బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకుంటే నగదు జమయ్యే అవకాశం ఉందని, దీనిని వేంటనే సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ సిబ్బందిని సంప్రదించితే సమస్యను గ్రీవెన్స్ పోర్టల్‌లో నమోదు చేస్తారని అన్నారు.

వైద్యం అందించడంలో ఆర్‌ఎంపీల పాత్ర ముఖ్యమైనది



అసోసియేషన్ సమావేశంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు

మంగళగిరి టౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించడంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల పాత్ర చాలా ముఖ్యమైనదని విజయవాడ వేదాంత హాస్పిటల్ అధినేత డాక్టర్ సందీప్‌కుమార్ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ రాత్రి సమయంలో అయినా ఫోన్ చేయగానే ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వచ్చిన ఆధునిక చికిత్స విధానంపై ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు వివరించారు. అనంతరం ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అధ్యయన తరగతుల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్‌తోపాటు 100 మందికి పైగా ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.30 వేలు జరిమానా

తాడికొండ: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకున్న ముగ్గురు వాహనదారులకు కోర్టులో రూ.30 వేలు ఫైన్ విధించినట్లు తాడికొండ సీఐ కె.వాసు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి ముగ్గురు మందుబాబులను పట్టుకొని కోర్టులో ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున రూ.30 వేలు జరిమానా విధిస్తూ మంగళగిరి కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. బహిరంగంగా మద్యం తాగడం, మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.